# ఊరూరా గణపతి ఉత్సవ శోభ

- నవరాత్ర ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు
- ఎక్కడికక్కడ సిద్ధమవుతున్న చలువ పందిళ్లు
- మట్టి గణపతులే ముద్దంటున్న పర్యావరణ ప్రేమికులు

అయినవిల్లి: విఘ్నాలు తొలగించే సిద్ధి వినాయకుడికి నిర్వహించే గణపతి నవరాత్ర ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సెప్టెంబరు 7న వినాయక చవితి పర్వదినం సందర్భంగా వినాయకుడికి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయాల వద్ద చలువ పందిళ్లను సిద్ధం చేస్తున్నారు. చవితికి మరో ఐదు రోజులే సమయమున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు ఏర్పాట్లలో తలమునకలవుతున్నాయి. ప్రధానంగా అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం చవితి ఉత్సవాలకు ముస్తాబవుతుంది. గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్న నేపథ్యంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

**వాడవాడలా చలువ పందిళ్లు**

పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అయినవిల్లి, పి.గన్నవరం, మామిడికుదురు, అంబాజీపేట మండలాల్లో ఉన్న 68 గ్రామాల్లోనూ వాడవాడలా గణేష్ ఉత్సవాల కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతి గ్రామంలో దాదాపు ఐదారు చోట్ల విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు సమాయత్తమవుతున్నారు. పలు గ్రామాల్లో ఆరు నుంచి 12 అడుగుల గణనాథ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు విగ్రహాల తయారీదారులకు ఆర్డర్లు ఇచ్చారు. అలాగే లడ్డూలను వినాయకుడి చేతిలో ఉంచేందుకు స్వీట్ స్టాల్స్‌కు ఉత్సవ కమిటీలు ఆర్డర్లు ఇచ్చారు. తొమ్మిది రోజులూ ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునేందుకు బందోబస్తు పరంగా పూర్తి సహకారం అందిస్తామని, అయితే నిబంధనల అమలుకు కూడా ఉత్సవ కమిటీలు అంతే బాధ్యత వహించాలని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా నిబంధనల గీత దాటితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. గతంలో ఉత్సవాలకు పలు అనుమతులు వివిధ శాఖల నుంచి తీసుకునే విధానం ఉండేది. ఇప్పుడు సింగిల్ విండో విధానం ద్వారా ఒకే చోట అనుమతులు తీసుకునే వెసులుబాటు తీసుకొచ్చారు.



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో మట్టి గణనాథుడు(ఫైల్)



విద్యుత్ కాంతులతో అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయ ప్రాకారం

**మట్టి గణపతులే మేలు**

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య పర్యావరణ కాలుష్యం. సకల విఘ్నాలను తొలగించే గణనాథుడి ప్రతిమల తయారీకి కృత్రిమ రంగులను వినియోగిస్తుంటే నిమజ్జనం అనంతరం అవి కాలుష్య కారకాలుగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. దీని నివారణకు మట్టి గణపయ్యలే మేలంటున్నారు పర్యావరణవేత్తలు. గ్రామాల్లో ఇప్పటికీ కొన్నిచోట్ల మట్టి గణపతులను ఏర్పాటు చేయడం పరిపాటి. అయితే పూర్తిస్థాయిలో మట్టి గణపతులకే ప్రాధాన్యమివ్వాలని పర్యావరణవేత్తలు ఊరూరా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది మట్టి గణపతి ప్రతిమలకు గిరాకీ ఏర్పడిందని పలువురు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే చిన్న సైజు ప్రతిమలను ఏర్పాటు చేస్తే నిమజ్జనం సమయంలో ఇబ్బందులు తలెత్తవని, పైగా చిన్న మట్టి విగ్రహాలు నిమజ్జనం తరువాత నీటిలో కరిగి జలానికి ఎటువంటి నష్టం కలగజేయవని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. ఇళ్లలో ప్రతిష్ఠించే విగ్రహాలతో పాటు మండపాల్లో ప్రతిష్ఠించే భారీ విగ్రహాల వరకూ మట్టి గణపతినే ఏర్పాటు చేసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

**సర్వాంగ సుందరంగా అయినవిల్లి**

అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో నవరాత్రుల్లో భాగంగా మూల విరాట్‌తో పాటు మట్టి గణపతి పూజలందుకుంటారు. ఈసారి వినాయకచవితి శనివారం రావడం, పైగా తరువాత రోజు ఆదివారం సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధికి వస్తారని ఆలయ అధికారులు భావిస్తున్నారు. ఇందుకు తగ్గట్టు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. విద్యుత్ లైట్లు, చలువ పందిళ్లు, ఆలయ గోపురం, ప్రాకారానికి రంగులద్దుతున్నారు. చవితి రోజున వచ్చే భక్తులకు భోజన వసతులు, ప్రసాదాలు అందించేందుకు ఇప్పటికే పూర్తి కార్యాచరణ రూపొందించారు. ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం బయట మట్టి గణపతిని ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు విశేష పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

### చవితికి అన్ని ఏర్పాట్లు చేశాం



చవితి సందర్భంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. స్వామి దర్శనం కోసం, స్వామి అన్నదాన ప్రసాదం తీసుకునేందుకు ప్రత్యేక క్యూలైన్లు సిద్ధం చేశాం. ప్రత్యేక టిక్కెట్లతో దర్శనాలకు, వీఐపీ దర్శనాలకు ప్రాధాన్యం తగ్గించాం. అందరూ స్వామిని ఉచిత దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నాం. ఫొటో షూట్ చేసుకునేందుకు ఆలయ ప్రాంగణంలో పుష్పాలతో గణపతి ప్రతిమలను ఏర్పాటు చేస్తున్నాం.

– ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్

## సనాతన ధర్మంపై విస్తృత ప్రచారం

మామిడికుదురు: మరుగునపడిన సనాతన ధర్మంపై విస్తృత ప్రచారం చేసి వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపడుతున్నామని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం మామిడికుదురులో 60 వసంతాల హిందూ సమ్మేళన ఉత్సవం మండల శాఖ అధ్యక్షుడు కూనపరెడ్డి రాము అధ్యక్షతన జరిగింది. ప్రజల్లో దేశభక్తితో పాటు దైవభక్తిని పెంపొందించడం, అంటరానితనం నిర్మూలించడం, ధార్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వీహెచ్‌పీ ప్రధాన లక్ష్యాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా హోమియో వైద్య సేవలందిస్తున్న వలవల బాబ్జి, నయినాల అబద్ధం, బొక్కా సూర్యప్రకాశరావు, తుమ్మల పద్మాజీరావు, కంచర్ల గణపతిరావు, బత్తుల రమేష్ తదితరులను సత్కరించారు. సమావేశంలో వీహెచ్‌పీ ప్రతినిధులు పోలిశెట్టి ప్రసాద్, నూలు మురళీకృష్ణ, నూలు శ్యామల, పెచ్చెట్టి భాస్కరరావు పాల్గొన్నారు.



హిందూ సమ్మేళన సభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి

## ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపేస్తే చర్యలు తప్పవు



ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

అయినవిల్లి: ప్రయాణికులు ఎక్కడానికి, దిగడానికి ఎక్కడ పడితే అక్కడ సడన్‌గా బ్రేక్ వేసి రోడ్లపై ఆటోలు ఆపితే చర్యలు తప్పవని ఆటో యూనియన్ నాయకులను సీఐ డి.ప్రశాంత్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం అయినవిల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఆటో యూనియన్ నాయకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల రోడ్లపై ఆటో ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. ఆటో డ్రైవర్లు అందరికీ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, రోడ్డు ట్యాక్స్ వంటి పత్రాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మైనర్లకు ఆటోలు ఇవ్వడం, మద్యం తాగి ఆటోలు నడపడం వంటివి నేరమన్నారు. పరిమితికి మించి ఆటోలో ప్రయాణికులను ఎక్కించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.మనోహర్ జోషి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చవితి పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

అయినవిల్లి: నవరాత్ర ఉత్సవాల సందర్భంగా చలువ పందిళ్లు, వినాయక విగ్రహాల ఏర్పాటుకు ముందస్తుగా ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ ప్రశాంత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ చవితి పందిళ్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకొచ్చిందన్నారు. గణేష్‌ఉత్సవ్.ఏపీపోలీస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పందిరి, మండపం ఏర్పాటు, కమిటీ సభ్యుల వివరాలు, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ, ఏర్పాటు చేసే ప్రదేశం వంటివి నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తును పోలీసు అధికారులు, అగ్నిమాపక సిబ్బంది, పంచాయతీ, విద్యుత్‌శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి క్యూఆర్‌తో కూడిన నిరంభ్యంతర పత్రం జారీ చేస్తారన్నారు. అనుమతులకు సంబంధించిన రుసుం మీసేవా కేంద్రంలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. నిరంభ్యంతర పత్రం జిరాక్సులు తీసి చవితి పందిరిలో అతికించాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ కె.మనోహరజోషి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

**ఉత్సవ కమిటీలకు అవగాహన సమావేశం**

అంబాజీపేట: నవరాత్రులను పురస్కరించుకుని గణపతి విగ్రహాల ఏర్పాటుకు ముందుగానే పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అంబాజీపేట పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ కల్యాణ మండపంలో ఎస్‌ఐ కె.చిరంజీవి అధ్యక్షతన మండలంలోని ఉత్సవ కమిటీల సభ్యులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చవితి మండపాలు ఏర్పాటుచేసే నిర్వాహకులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సింగిల్ విండో పోర్టర్ ద్వారా దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. అనుమతులు పొందిన పత్రాన్ని మండపాల వద్ద అతికించాలన్నారు. పోలీసులు మండపాలను సందర్శించే సమయంలో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తనిఖీ నిర్వహిస్తారన్నారు. మండపాల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు తీసుకోకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

## మొల్ల విగ్రహావిష్కరణకు తరలిరావాలి

అంబాజీపేట: విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో ఏర్పాటు చేసిన తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణకు కోనసీమలోని కుమ్మరి, శాలివాహనులు తరలిరావాలని జిల్లా కుమ్మరి, శాలివాహన సంఘ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి పిలుపునిచ్చారు. అంబాజీపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళా క్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్ణాటకలోని మైసూర్ ఎంపీ ఎదువీర కృష్ణ దత్త సమరాజు వడయార్ (మైసూర్ మహారాజ్) హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మానేపల్లి వీరబ్రహ్మం, దాలిపర్తి భీమేశ్వరరావు తదిదరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ముత్యాలరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న నాయకులు

అయినవిల్లి: ఆబోతు ఢీకొని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేదునూరుకు చెందిన మేడిశెట్టి ముత్యాలరావు కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు గోకరకొండ సత్యనారాయణ, గంజి వీరన్నబాబు రూ.13,500 ఆర్థిక సాయం చేశారు. ఈ మొత్తాన్ని ముత్యాలరావు కుటుంబానికి ఆదివారం అందజేశారు.

# నీట మునిగిన కాలనీలు



పాదలాడలో ముంపునకు గురైన కంచి కామాక్షమ్మ కాలనీ



కేశవదాసుపాలెం శివారు అగస్టీన్ కాలనీలో ఇళ్ల వద్దకు పోటెత్తిన ముంపు నీరు

రాజోలు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పలు కాలనీలు, పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. మండలంలోని సోంపల్లి డ్రైన్, చింతలపల్లి డ్రైన్‌లు ముంపు నీటితో పోటెత్తాయి. పాదలాడ కంచికామాక్షమ్మ కాలనీ పూర్తిగా ముంపునకు గురైంది. ముంపునీరు దిగకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా మోకాలు లోతు నీటిలో ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ముంపునీరు దిగేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజోలు మండలంలో చింతలపల్లి, పొన్నమండ, కూనవరం, శివకోడు, బి.సావరం, కడలి గ్రామాల్లోని కాలనీలను వర్షం నీరు ముంచెత్తింది.

నియోజకవర్గంలో సుమారు 4,400 ఎకరాల్లో వరి నాట్లు ముంపునీటిలో ఉన్నాయి. ముంపునీరు కారణంగా వరినాట్లు కుళ్లిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజోలు మండలంలో సుమారు 114 ఎకరాల్లో వేసిన వరినాట్లు ముంపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి.


వరి చేలల్లోని ముంపు నీరు దిగకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చింతలపల్లి, శివకోడు ప్రాంతాల్లో రైతులు కొందరు ఇంజిన్ల సాయంతో ముంపు నీటిని డ్రైన్లలోకి తోడుకుంటున్నారు.

**ముంపు బారిన పడిన అగస్టీన్ కాలనీ**

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశవదాసుపాలెం శివారు అగస్టీన్ కాలనీ భారీ వర్షాలకు ఆదివారం ముంపు బారిన పడింది. ముంపు నీరు వెళ్లడానికి ఎటూ దారి లేకపోవడంతో ఇళ్లల్లోకి పోటెత్తింది. ఇళ్లల్లోని గదుల్లో సామాన్లు వర్షం నీటితో తడిసి మద్దయ్యాయని స్థానికులు వాపోతున్నారు. కాలనీ చుట్టూ రొయ్యల చెరువుల సాగు వల్ల కూడా ముంపు నీరు చుట్టుముట్టిందని కాలనీవాసులు చెబుతున్నారు. ముంపు నీటిని మళ్లించేందుకు అధికారులు తక్షణం డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**వర్షం తగ్గినా వీడని ముంపు బెడద**

మామిడికుదురు: భారీ వర్షాలు తగ్గుముఖం పట్టినా గ్రామాల్లో ముంపు బెడద మాత్రం ప్రజలను వెన్నాడుతూనే ఉంది. వాయుగుండం కారణంగా రెండు రోజుల నుంచి ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో ముంపు నీరు భారీగా నిలిచిపోయింది. మామిడికుదురులో జాతీయ రహదారి నుంచి ముస్లిం వీధికి వెళ్లే రోడ్డుపై భారీగా వర్షం నీరు నిలిచిపోయింది.



మామిడికుదురులో రోడ్డుపై నిలిచిపోయిన ముంపు నీరు

నగరం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మామిడికుదురు, నగరం, పాశర్లపూడి గ్రామాల్లో సైతం జాతీయ రహదారిపై సైతం ముంపు నీరు నిలిచిపోయింది. కరవాక గ్రామంలో పంచాయతీ అధికారులు కచ్చా డ్రైన్లు తవ్వించి ముంపు నీటిని బయటకు మళ్లించారు. మొగలికుదురు, గెద్దాడ, మామిడికుదురు ఆల్‌క్యాస్ట్ కాలనీల్లోనూ ముంపు నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో 24 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## దిష్టిబొమ్మలా షాపింగ్ కాంప్లెక్స్




అంబాజీపేటలో శిథిలమైన షాపింగ్ కాంప్లెక్స్

అంబాజీపేట: స్థానిక పశువుల మార్కెట్ వద్ద ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ శిథిలమై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. గతంలో ఇదే షాపింగ్ కాంప్లెక్స్‌లో పలువురు నామమాత్రపు అద్దె చెల్లిస్తూ షాపులు నిర్వహించుకుంటూ జీవనం సాగించేవారు. కాలక్రమేనా షాపింగ్ కాంప్లెక్స్ శిథిలమవ్వడంతో అప్పటి అధికారులు మరమ్మతులు చేయిస్తామంటూ ఒక్కొక్కరినీ ఖాళీ చేయించారు. అనంతరం ఇవిగో ప్రతిపాదనలు, అవిగో అనుమతులు అంటూ హడావుడి చేయడం తప్ప మరమ్మతులు చేయించలేదు. మూడేళ్ల క్రితం జిల్లా పరిషత్ నుంచి వచ్చిన అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించి పూర్తిగా శిథిలమైపోయిందని దాని స్థానంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని చెప్పి వెళ్లిపోయారు. నాటి నుంచి అది దిష్టిబొమ్మలా మిగిలిపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎంతోమంది నిరుపేద యువకులకు జీవనాధారం లేకుండా పోయిందని పలువురు ఎస్సీ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## సీపీఎస్ రద్దు చేయాలంటూ నిరసన

అమలాపురం టౌన్: సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్టీయూ శాఖకు చెందిన ఉపాధ్యాయులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆదివారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రతిపాదించే మరే ప్రత్యామ్నాయ విధానాలను ఆమోదించబోమని జిల్లా ఎస్టీయూ శాఖ స్పష్టం చేసింది. నిరసనలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శివప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోలిశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాంబాబు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎస్వీ సత్యనారాయణ, అభయ కన్వీనర్ ఆర్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు కుంచెతో సంఘీభావం



సంగీత్ గీసిన చిత్రం

మలికిపురం: మలికిపురానికి చెందిన ప్రముఖ ఆర్టిస్ట్, సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ నల్లి సంగీత్ వైద్యులకు తన కుంచెతో సంఘీభావం తెలిపారు. కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచార ఘటనతో నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో న్యాయం చేయాలంటూ వేడుకుంటున్న వైద్యుల ఆవేదనను తెలియజేస్తూ ఆయన గీసిన చిత్రం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం తన అకాడమీలో ఈ చిత్రాన్ని ఆయన ప్రదర్శించారు.

## పుదుచ్చేరిలో కులగణన చేపట్టాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా కులగణన చేపట్టి ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ సీఎం నారాయణసామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం కాంగ్రెస్ పార్టీయే కాకుండా కేంద్ర మంత్రి చిరాగ్‌పాశ్వాన్, బీహార్ సీఎం నితీష్‌కుమార్ సైతం కుల గణన నిర్వహించాలని కోరుతున్నారన్నారు. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీ సైతం కులగణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. అలాగే పుదుచ్చేరిలో సైతం కులగణన చేయాలని డిమాండ్ చేశారు.

## సుబ్రహ్మణ్యేశ్వరరావు సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: గత 28 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన మెట్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. ఆదివారం అమలాపురం శివారులోని ఓ ఫంక్షన్ హాల్లో సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ కార్యక్రమానికి హాజరై సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సహచర ఉపాధ్యాయులు మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేశ్వరరావు సామంతకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఆయన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారని కొనియాడారు. సుబ్రహ్మణ్యేశ్వరరావు అందించిన సేవలకు గాను 2014లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారని చెప్పారు.



సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

## క్లుప్తంగా

### ఇంటింటా ఫీవర్ సర్వే



పాశర్లపూడిలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మామిడికుదురు: మండలంలోని పాశర్లపూడిలో ఆదివారం నుంచి ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. భారీ వర్షాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలను ముందస్తుగా గుర్తించి వారికి వైద్య సేవలందించే ఉద్దేశంతో సర్వే నిర్వహిస్తున్నారు. లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారులు రమ్యశైలజ, స్పందన ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ, ఆశ కార్యకర్తలు సర్వేలో పాల్గొన్నారు.

### వైఎస్సార్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

అంబాజీపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలను అన్ని గ్రామాల్లోనూ సోమవారం ఘనంగా నిర్వహించాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామని, అనంతరం వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

### మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



జి.పెదపూడిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. వనమనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి.పెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం, బోడపాటివారి పాలెం గ్రామాల్లో ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్‌లు దంగేటి అన్నవరం, నూకపెయ్యి ప్రసన్నకుమార్, యర్రంశెట్టి త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత ఉపాధ్యాయునికి ఘన సత్కారం



పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పి.గన్నవరం: నరేంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ చేసిన గొలకోటి గోవిందరాజును పాఠశాల పేరెంట్స్ కమిటీ, మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కోకోనట్ కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందరాజు అందించిన సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ మూర్తి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ పల్లంరాజు, నేరేడిమిల్లి సత్యనారాయణ, నాగిరెడ్డి శివప్రసాద్, చొప్పల రాంబాబు, కత్తుల ఆనందరావు, నల్లా బాలాజీ, నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యాన్నదాన పథకానికి రూ.31 వేల విరాళం



దాత సాహితికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పి.గన్నవరం మండలం నాగుల్లంకకు చెందిన పాలూరి సాహితి ఆదివారం రూ.31,000 విరాళంగా ఇచ్చారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. సాహితిని వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

### అన్ని వర్గాలకూ సమన్యాయం

మలికిపురం: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుబ్బలపాలెం గ్రామంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, మండల ఉపాధ్యక్షురాలు కందికట్ల లలిత, మల్లిపూడి సత్తిబాబు, గుండుబోగుల పెదకాపు తదితరులు పాల్గొన్నారు.